తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

వరంగల్ fb.com/vaartha

PUBLISHED FROM WARANGAL, KARIMNAGAR, HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

24-5-2023 బుధవారం సంపుటి : 29 సంచిక : 113 పేజీలు : 8+16 వెల : 6.50

నేపాల్‌లో తలదాచుకొన్న మావోయిస్టు అరెస్టు

బెంగళూరు వరదలో కొట్టుకుపోయిన బంగారం

5వ



సిడ్నీలో ప్రధాని మోడీ, ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్ ఆత్మీయ ఆలింగనం

# ఈ బంధం.. బలోపేతం

## సిడ్నీలో ముక్తకంఠంతో భారత్, ఆస్ట్రేలియా పిఎంలు మోడీ, ఆల్బనీస్

## మోడీ ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా రాక్‌స్టార్ స్వాగతమే: ఆల్బనీస్

## మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత్: మోడీ

**సిడ్నీ,మే 23:** భారత్ ఆస్ట్రేలియాలమధ్య ఉన్న బంధం ఏళ్లనాటిదని, అన్నిరంగాల్లోను పరస్పర సహకారంతో ముందుకు పోతున్నట్లు ప్రధానిమోడీ పేర్కొన్నారు. క్రికెట్‌కు మించిన అనుబంధం రెండుదేశాలమధ్య ఉందన్నారు. కామన్‌వెల్త్, క్రికెట్, ప్రజాస్వామ్యం, రెండుదేశాల ప్రజలు, రెండుదేశాల దోస్తీతోపాటే ఇపుడు ఇంధనం, ఆర్థికవ్యవస్థ, విద్యారంగాలపరంగా కూడా రెండుదేశాలమధ్య విడదీయలేని బంధం నెలకొన్నదన్నారు. అన్నింటికంటే రెండుదేశాల్లోను ఒకరిపై ఒకరికి నెలకొన్న అపార విశ్వాసమే బంధం బలపడేందుకు దోహదంచేసిందన్నారు. సిడ్నీలో 20 వేలమందికిపైగా సిఐఒలు, వివిధ రంగాల నిపుణులు,ప్రముఖులు హాజరైన సదస్సులో ఆయన మాట్లాడారు. మాబంధంకేవలం దౌత్యసంబంధాలకే పరిమితం ≫2



మంగళవారం సిడ్నీలో జరిగిన మోడీ సభకు హాజరైన అశేష ప్రజానీకం



మంగళవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో సమీక్ష చేస్తున్న సిఎం కెసిఆర్

## జూన్ 24 నుంచి 'పోడు'

# పట్టాల పంపిణి

### అర్హులకు ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు

### 25న కలెక్టర్ల సదస్సు

### జూన్ 14న నిమ్స్ విస్తరణ పనులకు శ్రీకారం

### సమీక్ష జరిపిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే23:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో రోజువారీ కార్యక్రమాలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సమీక్షించారు. పోడు భూముల పట్టాల పంపిణీ, తదితర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై సిఎం కెసిఆర్ మంగళవారం నాడు సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ పలు నిర్ణయాలు తీసుకున్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యాచరణకు సంబంధించి ఈనెల 25న జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రులు,జిల్లా ఎస్పీలు పాల్గొంటారు. ఇదిలా ఉండగా, జూన్ 24 నుంచి 30 వరకు గిరిజన సోదరులకు పోడు భూముల పట్టాల ≫2

## 'సివిల్స్'లో తెలుగు

# మెరుపులు



ఉమా హారతి (3వ ర్యాంకు)-తెలంగాణ



ఇషితా (ఫస్ట్ ర్యాంకు) యుపి



గరిమా (2వ ర్యాంకు) బీహార్

### తెలంగాణకు చెందిన ఉమా హారతికి 3వ ర్యాంక్

### 933 మందిని ఎంపిక చేసిన యుపిఎస్‌సి

### ఐఎఎస్-180, ఐపిఎస్- 200, ఐఎఫ్‌ఎస్‌కు 38 మంది ఎంపిక

### ఫలితాలు ప్రకటించిన సర్వీస్ కమిషన్

### పవన్ దత్తా (తిరుపతి) 22వ ర్యాంక్

### తరుణ్ పట్నాయక్ (రాజమండ్రి) 33

### సాయి ఆశ్రిత్ (వరంగల్) 40

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్‌తోపాటు సెంట్రల్ సర్వీసెస్‌లో నియామకాల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్‌సీ) నిర్వహించిన సివిల్స్-2022 ఫలితాల్లో ఈ ఏడాది కూడా అమ్మాయిలే టాపర్లుగా నిలిచారు. టాప్-4 ర్యాంకులను అమ్మాయిలే సొంతం చేసుకున్నారు. తెలంగాణకు చెందిన ఉమా హారతి ఆలిండియా 3వ ర్యాంక్‌ను సొంతం చేసుకోగా.. ఆలిండిమా మొదటి ర్యాంక్‌ను యూపీకి చెందిన ఇషితా కిశోర్ సొంతం చేసుకుంది. రెండో ర్యాంక్‌ను బీహార్‌కు చెందిన గరిమా లోహియా, 3వ ర్యాంక్‌ను తెలంగాణకు చెందిన ఉమా హారతి, 4వ ర్యాంక్‌ను యూపీకి చెందిన స్మృతి మిశ్రా సొంతం చేసుకున్నారు. సివిల్స్ ర్యాంకుల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ≫7



పవన్ దత్తా (22వ ర్యాంకు)



సాయి ఆశ్రిత్ (40వ ర్యాంకు)



మహేష్ (200వ ర్యాంకు)



శ్రవణ్ (222వ ర్యాంకు)

## రేపు ఎంసెట్ ఫలితాలు

### జూన్ 1 నుంచి కౌన్సెలింగ్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ ఈ నెల 10 నుంచి 14 వరకు నిర్వహించిన ఎంసెట్-2023 పరీక్షల ఫలితాలను రేపు (గురువారం) విడుదల చేయనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఎంసెట్-2023 పరీక్షలు ప్రశాంతంగా ముగిసిన విషయం తెలిసిందే. ఎంసెట్-2023 ఫలితాలను ఈ నెల 25 (గురువారం)న విడుదల చేయనున్న ఎంసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ డీన్ కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి గురువారం ఉదయం 11.30 గంటలకు జేఎన్‌టీయూ క్యాంపస్‌లో విడుదల చేయనున్నట్టు తెలిపారు. ఎంసెట్-2023కి సంబంధించి ప్రాథమిక కీకి విద్యార్థుల నుంచి మొత్తం 2374 అభ్యంతరాలు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ నెల ≫2

# 21 రోజులు 'దశాబ్ది'




### జూన్ 2న సచివాలయంలో ఉత్సవాలు ఆరంభం

### 3న రైతు దినోత్సవం, 22న అమరుల స్మారకం ఆవిష్కరణ

### రోజువారీ కార్యక్రమాలను ఖరారు చేసిన సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతి నిధి, హైదరాబాద్,మే23:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జూన్ 2వ తేదీ నుంచి 22వ ఏతదీ వరకు 21 రోజుల పాటు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో ఉత్సవాల రోజువారీ కార్యకమాల షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు సెక్రటేరియట్‌లో మంగళవారం నాడు సమీక్షించి ఖరారు చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల రోజువారీ షెడ్యూల్ వివరాలు ఇలా ఉన్నాయి. జూన్2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను సిఎం కెసిఆర్ ప్రారంభిస్తారు. ఆ రోజు గన్‌పార్క్ వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో సిఎం కెసిఆర్ జాతీయ పతాకావిష్కరణ జరుపుతారు. తర్వాత దశాబ్ది ఉత్సవ సందేశాన్నిస్తారు. అదే రోజున అన్ని జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో జాతీయ పతాక వందనం, దశాబ్ది ఉత్సవ సందేశాలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. జూన్3: తెలంగాణ రైతు దినోత్సవంగా జరుపుతారు. రాష్ట్రంలోని అన్ని రైతు వేదికలు కేంద్రంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూన్4: పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సురక్షా దినోత్సవం నిర్వహిస్తారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు చేస్తున్న కృషిని వివరించే విధంగా కార్యక్రమాలు ఉంటాయి. జూన్5: తెలంగాణ విద్యుత్ విజయోత్సవం జరుపుతారు. విద్యుత్ రంగంలో రాష్ట్రం సాధించిన గుణాత్మక మార్పును సభల్లో వివరిస్తారు. సింగరేణిలో సంబురాలు జరుపుతారు. జూన్6: తెలంగాణ పారిశ్రామిక ప్రగతి ఉత్సవం జరుపుతారు. జూన్7: సాగునీటి దినోత్సవం నిర్వహిస్తారు. జూన్ 8న ఊరూరా చెరువుల పండుగ నిర్వహిస్తారు. జూన్ 9: తెలంగాణ సంక్షేమ సంబురాలు నిర్వహిస్తారు. జూన్ 10: తెలంగాణ సుపరిపాలన దినోత్సవం నిర్వహిస్తారు. జూన్11: తెలంగాణ సాహిత్య దినోత్సవం నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో కవి సమ్మేళనాలు, రవీంద్రభారతిలో రాష్ట్ర స్థాయి కవి సమ్మేళనం ఉంటుంది.య జూన్12: తెలంగాణ రన్ నిర్వహిస్తారు. జూన్ 13: తెలంగాణ మహిళా సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తారు. జూన్ 14: తెలంగాణ వైద్యారోగ్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. జూన్15: తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం జరుపుతారు. అవార్డు సాధించిన ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులకు,ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేస్తారు. జూన్ 16: తెలంగాణ పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహిస్తారు. జూన్ 17: తెలంగాన గిరిజనోత్సవం జరుపుతారు. జూన్ 18: తెలంగాణ మంచి నీళ్ల పండుగ నిర్వహిస్తారు. జూన్19: తెలంగాణ హరితోత్సవం నిర్వహిస్తారు. జూన్20: తెలంగాణ విద్యాదినోత్సవం నిర్వహిస్తారు. అదే ≫2



# అవినాష్‌కు దక్కని ఊరట

### సిబిఐ అరెస్టు నుంచి రక్షించాలన్న పిటిషన్‌ను తిరస్కరించిన 'సుప్రీం'

### హైకోర్టు వెకేషన్ బెంచ్‌లో రేపు విచారణ

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో సహ నిందితుడుగా వున్న కడప ఎంపి అవినాష్ రెడ్డికి సుప్రీం కోర్టులో మరోసారి నిరాశ ఎదురయ్యింది. ముందస్తు బెయిల్‌పై అత్యవరంగా విచారించడంతో పాటు సిబిఐ తనను అరెస్టు చేయకుండా తగిన ఆదేశాలు ఇవ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం ధర్మాసనం తిరస్కరించింది. అవినాష్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ జె.కె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నరసింహాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి తరపు న్యాయవాదులతో పాటు వివేకానంద రెడ్డి తనయ డాక్టర్ సునితా రెడ్డి తరపు న్యాయవాదుల మధ్య వాడివేడిగా వాదనలు జరిగాయి. తనపై సిబిఐ నమోదు చేసిన కేసులో తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్‌కు సంబంధించిన పిటిషన్ అత్యవసరంగా విచారించేలా చూడాలని అవినాష్‌రెడ్డి తరపున దాఖలైన ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న డాక్టర్ సునీతా రెడ్డి తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. అవినాష్ రెడ్డి పిటి షన్‌ను జస్టిస్ జె.కె మహేశ్వరి, జస్టిస్ పిఎస్ నరసింహాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేబట్టి అనేక అంశాలపై అవినాష్ ≫2

### బ్యాంకుల్లో రూ. 2వేల నోట్ల

# మార్పిడి షురూ!

### పెద్దగా క్యూలు లేవు, ఎటిఎంల వద్దే రద్దీ


**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే23:** చలామణి నుంచి ఉపసంహరిస్తున్న రూ.2000 నోట్లను బ్యాంకు శాఖల్లో ప్రజలు మార్చుకుని, వేరే నోట్లు తీసుకునేందుకు మంగళవారం నుంచి అనుమతించిన విషయం తెలిసిందే. ఇందుకోసం బ్యాంకుల వద్ద తగిన మేర నగదు అందుబాటులో ఉంచారు. కాగా, 2వేల నోట్లు మార్చుకునేందుకు ప్రజలు బ్యాంకుల వద్ద పెద్దగా క్యూ కట్ట లేదు. ప్రధానంగా హైదరాబాద్‌లో ఏ బ్యాంకుల వద్ద ప్రజలు భారీ ఎత్తున క్యూ కట్ట లేదు. సాధారణంగా తమ అకౌంట్లు ఉన్న చోట స్వల్పంగా నోట్ల ≫2

### మల్కపేట రిజర్వాయర్

# ట్రయల్ రన్ సక్సెస్

### త్వరలో సిఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సన్నాహాలు

**సిరిసిల్ల బ్యూరో, మే 23, ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్ట్ ప్యాకేజీ 9లో బాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న మూడు టిఎంసిల సామర్థ్యం గల మల్కపేట రిజర్వాయర్ ట్రయన్ రన్ సక్సెస్ అయింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మల్కపేట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి కావడం, ట్రయల్ రన్ ≫2




రిజర్వాయర్‌లోకి వెళుతున్న గోదావరి నీరు

# కెసిఆర్ 'న్యూట్రిషన్ కిట్స్' రెడీ

### జూన్ 2 నుంచి పంపిణి ఆరంభం

### ఏర్పాట్లు చేయాలని మంత్రి హరీష్ ఆదేశం



**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ పంపిణీని ప్రారంభించనున్నట్టు వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు స్పష్టం చేశారు. 21 రోజుల దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖకు కేటాయించిన రోజున కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా వైద్యాధికారులను మంత్రి ఆదేశించారు. మంగళవారం మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, ఆరోగ్య కుటుంబ సంక్షేమ విభాగం కమిషనర్ శ్వేతా మహంతితోపాటు ఇతర విభాగాల హెచ్‌వోడీలు, జిల్లా కలెక్టర్లు, వైద్యాధికారులు పాల్గొన్నారు. 2023-24లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 6.84 లక్షల మహిళలు లబ్ధి పొందుతారని, 14-26 వారాల సమయంలో రెండో ఏఎన్‌సీ సమయంలో, 27-34 వారాల సమయంలో మూడో ఏఎన్‌సీ సమయంలో మొత్తం రెండు సార్లు కిట్ల పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. 24 జిల్లాల్లో 111 కేంద్రాల్లో కిట్ల పంపిణీ ఉంటుందని.. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. లబ్ధిదారుల సంఖ్యకు సరిపడా కిట్లు ఉండేలా చూడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. న్యూట్రిషన్ కిట్స్ పొందేందుకు వచ్చే గర్భిణీలు ఇబ్బంది పడకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. మాతృ మరణాలను తగ్గించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్స్ పథకానికి రూపకల్పన చేశారని మంత్రి హరీష్ రావు గుర్తు చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ప్రారంభించగా.. మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం 9 జిల్లాల్లో 1.25 లక్షల మంది గర్భిణీలకు రెండు ఏఎన్‌సీల్లో మొత్తం రెండున్నర లక్షల కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మంచి ఫలితాలు ఇస్తుండటంతో మిగిలిన 24 ≫2

# లైంగిక స్వేచ్ఛ నేరం కాదు

- బహిరంగ ప్రదేశాల్లో చేస్తేనే నేరం
- షెల్టర్‌హోం యువతికి సెషన్స్ కోర్టు విముక్తి



**ముంబయి, మే 23:** సెక్స్ అనేది నేరం కాదని, అయితే ఒకరికి ఇబ్బంది కలిగించేవిధంగా బహిరంగంగా ఈ లైంగికేచ్ఛకు పాల్పడటమే నేరం అని ముంబయిలోని ఒక సెషన్స్‌కోర్టు అభిప్రాయపడింది. ఇతరులకు అభ్యంతరకరంగా మారితే అది నేరం కిందకు వస్తుందని, బహిరంగ ప్రాంతాల్లో ఈచర్యలకు పాల్పడటం నేరమేనని తేల్చింది. అయితే సెక్స్‌వర్కర్లను ఈ నేరం కింద పరిగణించలేమని వెల్లడించింది. మేజిస్ట్రేట్‌కోర్టు ఈ ఏడాది మార్చినెలలో తనను ఒక షెల్టర్‌హోమ్‌కు తరలించారని, ఏడాదిగా తాను అక్కడే ఉంటున్నట్లు తెలిపారు. అమె ఈ ఉత్తర్వులపై సెషన్స్‌కోర్టును ఆశ్రయించింది. అదనపు సెషన్స్ జడ్జి సివి పాటిల్ మేజిస్ట్రేట్‌కోర్టు ఉత్తర్వులను పక్కనపెట్టి సమగ్ర ఉత్తర్వులు జారీచేసారు. వ్యభిచారగృహంపై దాడి సందర్భంగా ఒక మహిళ పట్టుబడటంతో ఆమెను సబర్బన్‌ములుంద్‌లోని ఒక షెల్టర్‌హోంకు తరలించారు. తర్వాత ఎఫ్ఐఆర్‌ను రిజిస్టరుచేసారు. ఆమెతోపాటు మరో ఇద్దరిని పైనా కేసులు నమోదుచేసి మజగావ్‌లోని మేజిస్ట్రేట్‌కోర్టులో హాజరుపరిచారు. వైద్యపరీక్షల అనంతరంమేజిస్ట్రేట్ ఆ యువతి మేజర్ అని అందువల్ల ఆమెను నవ్‌జీవన్ మహిళా వసతిగృహానికి తరలించాలని ఏడాదిపాటు ఆమెకు రక్షణ, వసతి కల్పించాలని ఆదేశించారు. అయితే ఈ ఉత్తర్వులపై ఆమహిళ సెషన్స్ కోర్టును ఆశ్రయించి తాను ఎలాంటి అనైతిక కార్యకలాపాలకు పాల్పడలేదని అభ్యర్థించింది. లైంగిక కార్యక్రమంలో పాల్గొనడం నేరం కాదని, బహిరంగప్రదేశాల్లో నిర్వహించడమే నేరం అని ఇతరులకు అభ్యంతరకరం అయినపక్షంలో నేరం కిందకు వస్తుందని సెషన్స్‌కోర్టు వివరించింది. అయితే పబ్లిక్‌లో ఈ యువతి ఎలాంటి సక్స్‌వర్క్‌లో పాల్గొన్నట్లు ఫిర్యాదులు లేవని గమనించిన సెషన్స్‌కోర్టు ఆమెను షెల్టర్‌హోంలోనే అదుపులో ఉంచడం మంచిది కాదని సెషన్స్‌కోర్టు జడ్జి వెల్లడించారు. బాధితురాలికి ఇద్దరుపిల్లలున్నారని, ఆమె అవసరం వారికి ఉంటుందని, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా అదుపులో ఉంచితే ఆమె స్వేచ్ఛకు ఆటంకం కలిగించినట్లేనని వెల్లడించారు. బాధితురాలి వయసురీత్యా ఆమెను మేజర్‌గానే పరిగణించి మేజిస్ట్రేట్‌కోర్టు ఉత్తర్వులను పక్కనపెడుతున్నట్లు చెప్పారు. ఆయువతికి స్వేచ్ఛను ప్రసాదిస్తున్నట్లు తీర్పు వెలువరించారు.

# శరత్‌బాబుకు కన్నీటి వీడ్కోలు

## చెన్నైలో జరిగిన అంత్యక్రియలు

**చెన్నై,మే 23:** సీనియర్ నటుడు శరత్‌బాబు అంత్యక్రియలు చెన్నైలో సినీ ప్రముఖులు కుటుంబసభ్యుల మధ్య పూర్తిచేసారు. హైదరాబాద్‌లోని ఏజ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన శరత్‌బాబు భౌతికకాయాన్ని ముందు హైదరాబాద్ ఫిలిమ్‌ఛాంబర్‌లో కొంతసేపు ఉంచారు. సన్నిహితులు, తోటి నటులు సంతాపం నివాళి అనంతరం చెన్నైలోని టినగర్‌లో ఉన్న శరత్‌బాబునివాసానికి



తరలించారు. చెన్నైలోని గిండి స్మశానవాటికలో శరత్‌బాబు కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఆయనకు అంత్య క్రియలు పూర్తిచేసారు. టాలివుడ్, కోలివుడ్ స్టార్లు రజనీకాంత్, జూనియర్ ఎన్టీఆర్, ప్రకాష్‌రాజ్, చిరంజీవి తదితరులు సోషల్‌మీడియాలో తమతమ సంతాప సందేశాలనుపోస్టుచేసారు. శరత్‌బాబుసోదరుల్లో ఒకరు ఆయన చితికి నిప్పంటించారు. దివంగత నటుడికి పిల్లలు లేకపోవడంతో సోదరుల్లో ఒకరు ఆయనకు తలకొరివిపెట్టినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. అంత్య క్రియల సందర్భంగా తెలుగు, తమిళ చిత్రపరిశ్రమకు చెందిన అనేక మంది ప్రముఖులు హాజరయి చివరిసారి శరత్‌బాబు భౌతికకాయాన్ని చూసి కన్నీటి పర్యంతం అయ్యారు.

ఢిల్లీ లిక్కర్ స్కాం..

# సిసోడియా రిమాండు పొడిగింపు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన మద్యం కుంభకోణం కేసులో సిబిఐ అరెస్టు చేసిన ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీష్‌సిసోడియా జ్యుడి షియల్ రిమాండును రౌస్ అవెన్యూ కోర్టు మరోమారు పొడిగించింది. సిసోడియా రిమాండు గడువు మంగళవారంతో ముగియడంతో సిబిఐ అధికారులు ఢిల్లీలోని పాట యాల గేటు ప్రాంతంలోని రౌస్ అవెన్యూ కోర్టు ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఈ కేసును విచారించిన కోర్టు సిసోడియా రిమాండును జూన్ ఒకటవ తేదీ వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే తనకు జైల్లో ఒక కుర్చీని, కొన్ని పుస్తకాలను సమ కూర్చాలని సిసోడియా కోరగా అందుకు అంగీకరించిన కోర్టు వీటిని ఇవ్వాలని జైలు అధి కారులను ఆదేశించింది. కాగా కోర్టుహాల్ నుంచి బయటకు వచ్చిన తరువాత సిసోడియా ప్రధాని మోడీపై విమర్శలు చేశారు. మోడీకి ప్రజాస్వామ్యంపై నమ్మకం లేదని, ఆయనలో అహంకారం పెరిగిపోయిందని సిసోడియా విమర్శించారు.

# జూన్ 9న ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ

## మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** జూన్ 9న మృగశిరకార్తె సందర్భంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో చేపప్రసాదం పంపిణీ చేయడం జరుగుతుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మంగళవారం డాక్టర్ బిఆర్‌అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్‌కుమార్, నగర పోలీస్ కమిషనర్ సివి ఆనంద్, మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యా, చేపప్రసాదం పంపిణీ చేసే బత్తిన సోదరులతో మంత్రి తలసాని సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రతి సంవత్సరం చేపప్రసాదం పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తూ వస్తుందన్నారు. కరోనా మహమ్మారి కారణంగా చేపప్రసాదం పంపిణీ చేయలేదని తిరిగి ఈసంవత్సరం నుంచి చేపప్రసాదం పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈప్రసాదం కోసం మనరాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాల నుంచి కూడా లక్షలాదిమంది వస్తుంటారని సాధారణ ప్రజలకు, వృద్దులకు ,వికలాంగులకు ,చిన్నపిల్లలకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదం పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోన్నుట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన బారికేడ్ల ఏర్పాటు, త్రాగునీరు సౌకర్యం కల్పించడం, ఎవరైనా అనారోగ్యానికి గురైతే అత్యవసర వైద్య సేవలు అందించడం కోసం హెల్త్‌క్యాంపులు ఏర్పాటు తోపాటు ఆంబులెన్స్‌లను అందుబాటులో ఉంచడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భోజన సౌకర్యం కూడా కల్పిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. అవసరమైన చేపపిల్లలను కూడా ప్రభుత్వమే మత్స్యశాఖ ద్వారా సరఫరా చేస్తుందని ఏర్పాట్లపై ఈనెల 25న వివిధ శాఖల అధికారులతో నాంపల్లి ఎగ్జిబిషన్‌గ్రౌండ్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈసమావేశంలో బత్తిన సోదరులు గౌరీ శంకర్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, అమర్నాథ్‌గౌడ్ ,అలకానంద తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని, చిత్రంలో సిపి ఆనంద్, బత్తిన సోదరులు వివిధ శాఖల అధికారులు

# టిఎస్ బి పాస్ నిర్లక్ష్యం వహించిన అధికారులకు జరిమానా

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** టిఎస్ బిపాస్ ద్వారా భవన నిర్మాణాలకు అనుమతిచ్చే విషయంలో నిర్లక్ష్యం వహించిన అధికారులకు మున్సిపల్ శాఖ జరిమాన విధించింది. ఆన్‌లైన్ విధానంలో భవనాలకు అనుమతులు ఇచ్చేందుకు టిఎస్ బిపాస్‌ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చింది. నిర్దేశించిన సమయంలో అనుమతులు ఇవ్వని 13 మంది అధికారులకు రూ.1000 నుంచి రూ.3000 వరకు జరిమాన విధించారు. ఇందులో ఇద్దరు మున్సిపల్ కమిషనర్లు ఉండగా, 11 మంది పరిశీలన చేసే అధికారులు ఉన్నారు. 2020 నుంచి ఇప్పటి వరకు 103 మంది అధికారులకు జరిమాన విధించారు. ఈ జరిమానాలు విధించాలని సంబంధించి కలెక్టర్‌లను ఆదేశించారు.

# ఆగస్టు 8న అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష

## సెప్టెంబర్ 12 నుంచి అక్టోబర్ 10 వరకు జెఎల్ పరీక్షలు

### తేదీలు ప్రకటించిన టిఎస్‌పిఎస్‌సి

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్‌సీ) మరో రెండు పరీక్షల తేదిలను ఖరారు చేసింది. ప్రశ్నాపత్రాల లీకేజీ కారణంగా గతంలో ప్రకటించిన రెండు పరీక్షలకు సంబంధించిన తేదిలను రద్దు చేయగా.. వాటిని మంగళవారం ప్రకటించింది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ పరిధిలోని అకౌంట్స్ ఆఫీసర్స్ పరీక్షను ఆగస్టు 8న నిర్వహించనున్నట్టు కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే ఇంటర్ విద్య కమిషనరేట్ పరిధిలోని వివిధ సబ్జెక్టులకు సంబంధించిన జూనియర్ లెక్చరర్ల నియామకంకు సంబంధించిన తేదిలను కూడా టీఎస్‌పీఎస్‌సీ ప్రకటించింది. జూనియర్ లెక్చరర్ల పరీక్షలను సెప్టెంబర్ 12 నుంచి ప్రారంభించి అక్టోబర్ 3 వరకు రెండు సెషన్‌లలో కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్‌టీ) ద్వారా పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించింది. జేఎల్ పరీక్షల్లో ఉదయం సెషన్‌లో జనరల్ స్టడీస్, జనరల్ అబిలిటీస్ పరీక్షను నిర్వహించగా.. మధ్యాహ్నం సబ్జెక్టుకు సంబంధించిన పరీక్షను నిర్వహించనున్నారు.



చంద్రమోహన్ దంపతులకు వంశీ ఎన్టీఆర్ పురస్కారం ప్రదానం చేస్తున్న మాజీ జెడి లక్ష్మీనారాయణ, వంశీరామరాజు, నరసింహారావు తదితరులు

# ప్రముఖ నటుడు చంద్రమోహన్‌కు వంశీ ఎన్టీఆర్ పురస్కారం

## కుటుంబ వ్యవస్థకు పెట్టిందిపేరు ఆయన సినిమాలు: మాజీ జెడి లక్ష్మీనారాయణ

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 23, ప్రభాతవార్త :** వంశీ ఇంటర్నేషనల్ ఇండియా సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న పద్మశ్రీ డా. నందమూరి తారక రామారావు శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిబిఐ విశ్రాంత అధికారి వి.వి.లక్ష్మీనారాయణ (జెడి లక్ష్మీనారాయణ) చలనచిత్రసీమలో ఎన్నో విభిన్న పాత్రలు వేయికిపైగా పోషించి ప్రజాదరణ పొందిన ప్రముఖ నటుడు చంద్రమోహన్ దంపతులను ఘనంగా సన్మానించి ప్రతిష్టాత్మక డా. ఎన్.టి.ఆర్–వంశీ పురస్కారాన్ని బహూకరించి ప్రసంగిస్తూ చంద్రమోహన్ కుటుంబ వ్యవస్థను కాపాడే ఎన్నో సినిమాల్లో అద్భుతంగా నటించి చైతన్యం కలిగించారని, అల్లూరి సీతారామరాజు చిత్రంలో ఆయన పాత్ర, నటన ఎంతో ఆకట్టుకున్నాయని, చంద్ర మోహన్ గొప్పవ్యక్తిత్వం గల అందమైన నటుడని, ఆయనకు తెలుగువారికి గుర్తింపు తెచ్చిన మహోన్నతుడు ఎన్టీఆర్ పేర పురస్కారంతో సత్కరించడం మంచి నిర్ణయమని కళాబ్రహ్మ శిరోమణి డా. వంశీరామరాజును ఎంతగానో అభినందించి, చంద్రమోహన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా పాల్గొన్న రచయిత్రి జలంధర, న్యూస్ ప్రెసెంటర్ దేశాయ్, శ్రీదేవి, డా. తెన్నేటి సుధ, ఎస్.శైలజ, దైవజ్ఞశర్మ తదితరులతో విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీదర్శకుడు రేలంగి నరసింహారావు చంద్రమోహన్ తనకు కామెడీ గురువని, ఆయన 25 చిత్రాలకు దర్శకత్వం వహించానని, ఆయనకు ఎన్టీఆర్ అవార్డు రావడం తనకొచ్చినట్లు సంతోషిస్తున్నానని అన్నారు.

# ట్రాఫిక్ డిసిపి కారుపై దాడి

- నటి డింపుల్ హయాతిపై కేసు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** నటి డింపుల్ హయాతిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఐపిఎస్ అధికారి, ట్రాఫిక్ డిసిపి రాహుల్‌హెగ్డే కారుపై దాడి చేశారన్న కారణంతో ఆయన డ్రైవర్ చేతన్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నటి డేవిడ్ అనే వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. జూబ్లీహిల్స్ జర్నలిస్టుకాలనీలోని హుడా ఎన్‌క్లేవ్‌లో డిసిపి హెగ్డే ఉంటున్నారు. ఆదే అపార్ట్‌మెంట్‌లో డింపుల్ హయతి, డేవిడ్ కూడా నివసిస్తున్నారు. సెల్లార్‌లో ఉన్న పార్కింగ్ ప్లేస్‌లో హెగ్డే అధికారిక వాహనాన్ని నటి డింపుల్ హయతి ధ్వంసం చేసింది. దీంతో డిసిపి డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో డింపుల్ హయతి, డేవిడ్‌పై వివిధ సెక్షన్ల కింద కేసు నమో దైంది. 41 సిఆర్‌పిసి కింద పోలీసులు వారికి నోటీసులు ఇచ్చారు. మరోవైపు దీనిపై డింపుల్ హయతి ట్వీట్ చేసింది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తప్పును కప్పిపుచుకున్నట్లు పరోక్షంగా డిసిపిని ఉద్దేశించి వ్యాఖ్యానించింది.

### రిక్వెస్ట్ చేసినా డింపుల్ తీరు మారలేదు: డిసిపి రాహుల్ హెగ్డే

తనకారుపై నటి డింపుల్ హయతి దాడి చేసిన ఘటనపై డిసిపి రాహుల్ హెగ్డే స్పందిం చారు. ఈ మేరకు మీడియాతో ఆయన మాట్లాడారు. 'డింపుల్ హయాతి నేను ఒకే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాం. నా అధికారిక వాహనాన్ని ఆమె ఢీకొట్టింది. నేను పార్కు చేసే స్థలంలో డింపుల్ తన కారును అడ్డుగా పెడుతున్నది. పోలీసు అధికారిని కాబట్టి అత్యవసరంగా వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ఆమె తన కారును అడ్డుపెట్టి ఇబ్బంది పెడుతున్నది. నా వాహనాన్ని ఢీకొట్టి కాలుతో తన్నింది. ఇలా చాలాసార్లు జరి గింది. నేను వ్యక్తిగతంగానూ రిక్వెస్ట్ చేశాను. అయినా ఆమె తీరు మారలేదు. దీంతో మా డ్రైవర్ చేతన్ జూబ్లీహిల్స్ పిఎస్‌లో ఫిర్యాదు చేశారు. నేను అధికారాన్ని అడ్డు పెట్టుకుని తప్పును కప్పిపుచ్చినట్లు ట్వీట్ చేసింది. నాకు డింపుల్‌కు వ్యక్తిగతంగా గొడ వలు ఏమీలేవు. ఆమె చేసిన ఆరోపణలు పోలీసుల విచారణలో బయటపడతాయి' అని రాహుల్ హెగ్డే అన్నారు.

### గన్‌మెన్‌లతో ఉండే అంతపెద్ద ఆఫీసర్‌ను నేనేం చేస్తాను : నటి డింపుల్ హయతి

అపార్ట్‌మెంట్ పార్కింగ్ ప్లేస్‌లో ట్రాఫిక్ డిసిపి కారును ఢీకొట్టారన్న కేసు ఎదుర్కొంటున్న సినీనటి డింపుల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తనమీద తప్పుడు కేసు పెట్టారని ఆరోపిం చింది. తాను డిసిపిని ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని డిసిపినే తన కారు కోసం అపార్ట్ మెంట్‌లోకి ట్రాఫిక్ కోన్స్‌ను తెచ్చి పెట్టారని ఆరోపించింది. పబ్లిక్ ప్రాపర్టీ తీసుకవచ్చి ప్రైవేట్ ప్రాపర్టీలో పెట్టారని, ట్రాఫిక్ కోన్స్‌ను ప్రైవేట్ అపార్ట్‌మెంట్‌లో ఎలా పెడతారని ప్రశ్నించింది. డిసిపి కారుకు ఎక్కడైనా ప్రమాదం జరిగి ఉండొచ్చని.. నా కారుతో ఢీ కొడితే రెండు కార్లకు డ్యామేజీ ఉండాలి కదా అని ఆమె ప్రశ్నించింది. గన్‌మెన్‌తో ఉండే అంత పెద్ద ఆఫీసర్లను నేనేం చేస్తాను? కేసు కోర్టు వరకు వెళ్లిన తర్వాత అన్ని వివరాలు వెల్లడిస్తానని ఆమె తెలిపింది.

# ఉల్లి రైతు కంట కన్నీరు.. క్వింటాలు రూ. 950

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఉల్లి సాగు చేస్తున్న తెలంగాణలోని రైతుల పరిస్థితి దయనీయంగా తయారయింది. మార్కెట్‌లో ధరలు లేక రైతులను తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారు. మార్కెట్లో రోజు రోజుకూ ఉల్లి ధరలు పడిపోతుండటంతో కన్నీటి పర్యాంతమవుతున్నారు. పంటను అమ్ముదామని మార్కెట్‌లోకి తీసుకెళితే ఉల్లి కోత కోసం కూలీలకు చేసే ఖర్చు సైతం రావడం లేదు. దీంతో ఉల్లి పంటను తీయకుండానే పొలాల్లోనే వదలి వేస్తున్నారు.

కూలీ డబ్బుల బదులు ఉల్లిని ఇస్తామంటున్న రైతులు వాటిని తీసుకునేందుకు కూడా కూలీలు ముందుకు రావడం లేదు. గత ఏడాది మార్కెట్‌లో 3 వేల రూపాయలకు పైగా ధర ఉండటంతో ఈ ఏడాది కూడా అవే రేట్లు వస్తాయనే ఆశతో తెలంగాణలో పలువురు రైతులు పెద్ద ఎత్తున ఉల్లి సాగును చేపట్టారు. ప్రస్తుతం పంట చేతికి వస్తుండటంతో మార్కెట్‌లో ధరలు లేక ఉసూరంటున్నారు. మార్కెట్‌ను బట్టి క్వింటాలు రూ. 800 నుండి రూ. 950 వరకూ రైతుల వద్ద నుండి వ్యాపారులు ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. వినియోగదారులకు కేజీ 11 రూపాయల నుండి 15 రూపాయల వరకూ గ్రేడులను బట్టి విక్రయిస్తున్నారు. ఉల్లి సాగుకు ఒక ఎకరానికి దాదాప 30 వేల రూపాయల వరకూ రైతులకు ఖర్చవుతోంది. అయితే రేటు లేకపోవడంతో కూలీ, రవాణా ఖర్చులు రాక తీవ్ర నష్టాల పాలవుతున్నారు.



# శాస్త్రోకంగా గోవిందరాజస్వామి ఆలయ మహాసంప్రోక్షణ

**తిరుపతి,మే 23 ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో మహాసంప్రోక్షణలో భాగంగా మంగళవారం శాస్త్రోకంగా వైదిక కార్యక్ర మాలు జరిగాయి.ఆలయంలో ఏర్పాటుచేసిన యాగశాలలో హోమగుండాలు వెలి గించి పుణ్యాహవచనం,విష్వక్సేనారాధాన,కుంభారాధన, పంచగవ్యారాధన విశేషపూ జలు,సాయంత్రం 6నుంచి రాత్రి 8.30 గంటల వరకు వైదిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమంలో పెద్ద జీయర్‌స్వామి, చిన్న జీయర్ స్వామి, టిటిడి బోర్డు సభ్యులు పోకల అశోక్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస దీక్షితులు,ఆలయడిప్యూటీ ఇవోశాంతి,ఏఇవో రవికుమార్, సూపరింటెండెంట్లు మోహన్‌రావు, నారాయణ,టెంపుల్ ఇన్స్పెక్టర్లు,ధనుంజయులు,రాధాకృష్ణ పాల్గొన్నారు.

# 37 మంది డిఎస్‌పిలకు అదనపు ఎస్‌పిలుగా పదోన్నతులు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో డిఎస్‌పిలుగా పనిచేస్తున్న 37 మంది అధికారులకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పిస్తూ సర్కారు మ ంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వీరిలో హైదరాబాద్ రేంజికి చెందిన వారు 28 మంది వరంగల్ రేంజికి చెందిన వారు తొమ్మిది మంది వున్నారు. పదోన్నతులు అందుకున్న వారిలో ఒక అధికారి 1989 బ్యాచ్‌కు చెందిన వారు కాగా మిగతా వారు 1991 బ్యాచ్‌కు చెందిన అధికారులున్నారు. పదోన్నతులు అందుకున్న వారికి కొ త్తగా ఎక్కడా పోస్టింగులు ఇవ్వలేదు. ప్రస్తుతానికి వీరు ఇప్పుడున్నచోటే కొనసాగాలని ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్రంలో ఐదారు నెలల్లో జరగనున్న సాధారణ ఎన్ని కల నేపథ్యంలో త్వరలో జరిగే బదిలీలలో వీరికి కొత్త చోట పోస్టింగులు లభించే వీలుంది.

# హుక్కా కేంద్రంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

## నిర్వాహకుల అరెస్టు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** పోలీసులు ఎన్ని ఆంక్షలు విధించిన, ఎన్ని కఠిన చర్యలు తీసుకుంటున్నా హైదరాబాద్‌లో హుక్కా దందా ఆగడం లేదు. ప్రమాదక రమైన సిగరెట్ పైపులను వాడుతూ నాసీరకం పొగాకుతో పాటు మత్తుగా వుండేందుకు కొన్నిరకాల రసాయన మిశ్రమాలను కలుపుతూ యువతను ఆకర్షిస్తూ వారి ఆ రోగ్యాన్ని పాడుచేస్తున్న హుక్కా దందాపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడుల పరంపర కొనసాగుతూనే వుంది. తాజాగా సోమవారం రాత్రి నాంపల్లి యూసుఫియన్ దర్గా వద్ద దుబాయ్ షీషా లాంజ్



టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన హుక్కా నిర్వాహకులు

పేరిట రహస్యంగా సాగుతున్న మరో కేంద్రంపై దాడిచేశారు. ఈ సందర్భంగా ముగ్గురు నిర్వాహకులతో పాటు 13 మంది వినియోగదారులు పట్టుబడ్డారు. వీరి వద్ద నుంచి 8,880 రూపాయల నగదుతో పాటు పెద్ద ఎత్తున హుక్కా పైపులతో పాటు ఇతర సామాగ్రి జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు మంగళవారం మీడియాకు వెల్లడించారు. పాతబస్తీలోని మొగల్‌పురాకు చెందిన మహమ్మద్ సుల్తాన్ (29) ఈ కేంద్రానికి మే నేజర్‌గా వ్యవహరిస్తున్నాడు. ఇతని అనుచరులు చార్మినార్‌కు చెందిన షేక్ ఇజాజ్ (21), ఫలక్‌నుమాకు చెందిన షేక్ సాజిద్ (21)లు ఇక్కడ ఉద్యోగులుగా పనిచేస్తున్నా రు. భవానినగర్‌లోని తలాబ్‌కట్టకు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి ఈ కేంద్రానికి యజమానిగా వున్నాడు. ఇతను పరారీలో వున్నాడు.

హుక్కా కేంద్రం వద్దకు కొందరు యువకులు రెగ్యులర్‌గా వస్తుండడంతో నిర్వాహకులకు మంచి ఆదాయం కూడా వస్తోంది, వాస్తవానికి హుక్కా కేంద్రాలను సర్కారు చాలా కాలం క్రితమే నిషేధించింది. వీటివల్ల యువత ఆరోగ్యం పాడవుతుండడంతో పాటు ప్రమాదకరమైన, నాసికరం అయిన పొగాకు, రసాయన మిశ్రమాలతో రూపొందిన హుక్కా పీల్చడం వల్ల వీటికి బానిసలుగా మారిన వారు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా వుంది. కాగా ఈ కేంద్రం గురించి సమాచారం అందుకున్న మధ్య మండల టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ర ఘునాథ్ నేతృత్వంలోని టాస్క్‌ఫోర్స్ పోలీసు బృందం పక్కాగా వ్యవహరించి దాడి చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు నిర్వాహకులతో పాటు 13 మంది వినియోగ దారులు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా 8,880 రూపాయల నగదుతో పాటు పెద్ద ఎత్తున హుక్కా నిలువలతో పాటు పైపులను ఇతర వస్తువులను జప్తు చేశారు. ప ట్టుబడ్డ నిందితులను తదుపరి విచారణ నిమిత్తం హబీబ్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

## అవినాష్‌రెడ్డిపై సిబిఐ చేస్తున్న విచారణకు

# ప్రభుత్వానికి ఏం సంబంధం?

## ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి

**విజయవాడ, మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఎంపీ అవినాష్‌రెడ్డిపై సీబీఐ చేస్తున్న విచారణతో రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు సంబంధం ఉంటుందని ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టం చేసారు.మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డి ఎదుర్కొం టున్నారు.ఆయనను అరెస్ట్ చేయనివ్వకుండా ప్రభుత్వం సీబీఐని నియంత్రి స్తుందనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో మంగళవారం సజ్జల రామ కృష్ణారెడ్డి మీడియాతో అవినాష్‌రెడ్డి అంశంతో సహా రాష్ట్రానికి కేంద్రం రెవెన్యూలోటు నిధుల విడుదల చేయడంతో సహా వివిధ అంశాలపై మాట్లా డుతూ ఏంపీగా అవినాష్‌రెడ్డివ ఒక బాధ్యత కలిగిన ఎంపీ అన్నారు.ఆయన సీబీఐ ఎన్నిసార్లు విచారణకు పిలిచినా సహకరిస్తున్నారన్నారు.ఇప్పటికే ఆరేడుసార్లు సీబీఐ విచారణకు హాజరయ్యారన్నారు. తన తల్లికి బాగోలేక పోవడంతో విచారణకు హాజరుకాలేనని అవినాష్ సీబీఐకి చెప్పారన్నారు. విచారణకు వచ్చేందుకు మరి కొంత సమయం ఇవ్వాలని కోరారన్నారు. అవినాష్ అరెస్ట్‌కు కర్నూలు ఎస్పీ సహకరించడం లేదడనం ఊహాజనితం శాలను ప్రచారం చేయడం అవుతుందన్నారు.అవినాష్ విషయంలో ఏమిటీ అన్యాయమని అనుకునేవారు కర్నూలుకు వస్తున్నారన్నారు,తరచు ఆర్థిక పరమైన అంశాలు ఎదుర్కొకుండా రాష్ట్రానికి రూ.10వేల కోట్లు రెవెన్యూ లోటు నిధులను ఇచ్చిందని తెలిపారు,ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో కృషి చేసారన్నారు.ఆయన ప్రధాని వద్దకు ఢిల్లీకి వెళ్ళితే టీడీపీ కట్టు కథలను అల్లిందన్నారు.సీఎం జగన్ నిధులను సాధిస్తే గత ప్రభుత్వంలో ఎందుకు ఇవ్వలేదని చంద్రబాబు అనుకూల మీడియా ఈర్ష్యతో రాతలు రాస్తుందన్నారు.నిజమైన మీడియాతో పనిచేస్తున్న వారిపై దాడి జరుగలేదన్నారు.గతంలో రాష్ట్రానికి రావా ల్సిన నిధులనే కేంద్రం ఇప్పుడు ఇచ్చిం దన్నారు.గత ప్రభుత్వం ఈ విషయంలో తగిన ప్రయత్నాలు చేయలేద న్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నిధుల విడుదల కోసం ఎంతో పరిశ్రమిం చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాల చేయడంవల్ల నిధులు విడుదలయ్యాయన్నారు.నిధులు రాకపో యినా పట్టుదలగా సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నా మన్నారు. అవి నాష్ విషయంలో డ్రామాలు, నా టకాలు ఆడు తున్నారంటే ఎవ రికైనా కడుపు మండకుండా ఉంటుందా? అన్నారు.ఎవరికో ఆవేశం వస్తే ప్రశ్నిస్తారు.దీనిపై మీడియాపై దాడి అని అంటున్నారన్నారు. కర్నూ లుకు కేంద్రబలగాలు వస్తున్నాయని కొన్ని మాధ్యమాల్లో అసత్య కథనాలు ప్రచా రం చేసారన్నారు.



తెలంగాణ ప్రభుత్వం
మునిసిపల్ కౌన్సిల్ కార్యాలయం, పెద్దపల్లి
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన
1) E1/180/2023, తేదీ: 23.05.2023, 2) పనుల సంఖ్య: 04 పనులు. అంచనా ధర: రూ.16.30 లక్షలు. 3) బిడ్ డాక్యుమెంట్లు: 23.05.2023 నుండి మ.02.00గం.వద్ద అందుబాటులో. 4) బిడ్స్ దాఖలుకు చివరి తేదీ: 24.05.2023 మ.02.00గం.వరకు. 5) టెక్నికల్ బిడ్ తెరచు తేదీ, సమయం: 24.05.2023 మ.02.01గం.వద్ద. 6) ప్రైస్ బిడ్ తెరచు తేదీ సమయం: 24.05.2023 మ.03.00గం. వద్ద. 7) సంబంధిత అధికారి పేరు, చిరునామా: ఎమ్.శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్, పెద్దపల్లి మునిసిపాలిటీ, పెద్దపల్లి జిల్లా, వివరాలకు: కమిషనర్ గారి సెల్ నం. 9100902361 మరియు కె.సతీష్‌కుమార్, MAE సెల్ నం.9490862431 సంప్రదించండి.
DIPR.No.2129-PP/CL/Advt/1/2023-24 తేదీ:23.05.2023 సం/-. కమిషనర్, పెద్దపల్లి మునిసిపాలిటీ.

# రైతులకు తరుగు నష్టం రూ.1,000 కోట్లు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరులో కోత పెడుతుండడంతో దాదాపు 1,000 కోట్ల రూపాయల మేర రైతులు నష్టపోతున్నట్లు అంచనా. రాష్ట్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటి నుండి రైతుల దోపిడీ యద్దేచ్ఛగా కొనసాగుతోంది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కై ధాన్యం కొనుగోళ్లలో చేతి వాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టుకుని ధాన్యాన్ని తీసుకురాగానే తేమ, తాలు, తప్ప పేరుతో తూకంలో కోత పెడుతున్నారు. కొనుగోళ్ల ప్రారంభమైనప్పటి నుండి మిల్లర్లు, కేంద్రాల నిర్వహకులు రైతుల దోపిడీకి శ్రీకారం చుట్టారు. ధాన్యం వచ్చిన తరువాత బస్తాకు 6 లేక 7 కిలోల ధాన్యాలు తాలు, తప్ప పేరుతో కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లర్లు తగ్గించి వేస్తున్నారు. కొన్ని జిల్లాల్లో బస్తాకు 4 కిలోల నుండి 5 కిలోల వరకూ తరుగు పేరుతో కోత పెడుతున్నారు. మరికొన్ని జిల్లాల్లో 5 లేక 6 కిలోల వరకూ తగ్గింపు ఉంటోందని రైతులు వాపోతున్నారు. ఇక మారుమూల ప్రాంతాల్లో అయితే ఈ దోపిడీకి అంతుపంతూ లేకుండా పోతోందనే విమర్శలు ఉన్నాయి. ఈ యాసంగి సీజనులో 1.40 కోట్ల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం దిగుబడి అవుతుందని అంచనా. ఈ లెక్కన తరుగు పేరుతో కోత పెడుతున్న ధాన్యం విలువ మద్దతు ధరల ప్రకారం దాదాపు 1,000 కోట్ల రూపాయలుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు నిర్వహకులు, రైస్ మిల్లర్లు అదనంగా లబ్ధి పొందుతుండగా, ఎండ, వాన లేకుండా ఇంటిల్లిపాతి కష్టించి పనిచేసి పండించిన రైతులు మాత్రం నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో

## బస్తాకు సగటున 5 కిలోల వరకూ కోత
## యథేచ్ఛగా కొనసాగుతున్న ధాన్యం దోపిడీ
## కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్ల కుమ్మక్కు
## పట్టించుకోని అధికారులు

తరుగు ఎందుకు ఇవ్వాలని ఎవరైనా రైతులు అడిగితే ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా తాలు, మట్టి బెడ్డలు, తేమ ఉన్నాయని తిరస్కరిస్తున్నట్లు బహిరంగ విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం ఉన్నా మద్దతు ధరలు ఇవ్వకుండా వాటిల్లో కోత పెడుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కాగా గతంలో వరి కోతలు, కుప్పలు, నూర్పిడులు కూలీలు చేయడంతో ధాన్యంలో తాలు, మట్టిబెడ్డలు వంటివి ఉండేవి. అయితే కొన్నేళ్లుగా కూలీల కొరతతోపాటు, వ్యవసాయంలో యంత్రాల వినియోగం పెరిగింది. ఈ విధంగా ప్రస్తుతం రాష్ట్రం మొత్తం మీద వరి కోతలను యంత్రాలతో చేస్తుండడంతో ధాన్యంలోకి మట్టిబెడ్డలు వచ్చే అవకాశం ఎంత మాత్రం లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. దీనికి తగినట్లుగా ధాన్యంలో తాలు గింజలు లేకుండా ఉండేందుకుగాను భారీ ఫ్యాన్లతో తూర్పారపడుతున్నారు. ఇందుకుగాను గంటకు 2 వేల రూపాయలకు పైగా కిరాయిని సైతం రైతులు చెల్లిస్తున్నారు. అలాగే తూర్పారబెట్టే మనుషులకు గంటకు 250 రూపాయల చొప్పున చెల్లించి ధాన్యంలో మట్టిబెడ్డలు, తాలు గింజలు, నాణ్యత లేని గింజలు లేకుండా జాగ్రత్తలు పడి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తుండగా, అక్కడ అన్యాయంగా రైతులను దోపిడీ చేస్తున్నారని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళితే అందులో తేమ ఉందని తిరస్కరిస్తున్నారు. దీంతో సంబంధిత రైతులు మళ్లీ అక్కడే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ఈ లోపుగా అకాల వర్షాలు మళ్లీ రైతులపై పగపడుతుండడంతో ఆరబోసిన ధాన్యం తడిసిపోతుండడంతో వారి పరిస్థితి దయనీయంగా తయారైంది.

## జనన, మరణాలతో ఓటర్ల జాబితాల సవరణలు

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 23:** జనన మరణాల నమోదు ఆధారంగా భవిష్యత్తులో ఓటర్ల జాబితాలో ఆటోమేటిక్‌గా మార్పులుచేసే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడించారు. జననాల జాబితాలో పేర్లు



నమోదైన నాటికి 18 ఏళ్లు నిండిన వెంటనేనేరుగా ఎన్నికల సంఘం సందేశం పంపుతుందని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తుందని, ఆ వెంటనే పేర్లు ఓటర్ల జాబితాలో చేరిపోతాయని తెలిపారు. ఎవరైనా చనిపోతే మరణాల జాబితా ద్వారా ఎన్నికల సంఘానికి సమాచారం వెళుతుందని,వాటి ఆధారంగా మరణించిన వ్యక్తికుటుంబసభ్యులకు నోటీసు పంపి వివరణ తీసుకుని 15 రోజుల్లో పేరును తొలగించేలా నిబంధనలు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి ఎన్నో మార్పులతో వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. డేటాను ఒకచోట అప్‌డేట్‌చేస్తే అన్నిచోట్లా అయ్యేలా కొత్త విధానం వస్తోందన్నారు.

ఢిల్లీలోజనగణన భవన్‌నుప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభా లెక్కలసేకరణకోసం జియోఫెన్సింగ్ అప్లికేషన్ రూపొందించామని, క్షేత్రస్తాయిలో జనాభా లెక్కలు సేకరించేవారు తమకు కేటాయించిన బ్లాక్‌లోపర్యటించకుండా లెక్కలు నమోదుచేస్తే వెంటనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం వెళుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్లాక్‌లను ఇపుడు జియో ఫెన్సింగ్ చేస్తున్నామని కేంద్ర మంత్రి అమిత్‌షా వివరించారు.

## జూన్ 5 నుండి గొర్రెల పంపిణీ

### పశుసంవర్ధక మంత్రి శ్రీనివాసయాదవ్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గొల్ల, కురుమలు ఎదురు చూస్తున్న గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని జూన్ 5వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు పశుసంవర్ధక శాఖ మంత్రి టి శ్రీనివాసయాదవ్ తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడినట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ రెండో విడత గొర్రెల పంపిణీని నల్లగొండ జిల్లాలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో దీన్ని మొదలు పెడుతున్నామన్నారు. ఆ రోజు రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో మంత్రులు, ప్రజాప్రతినిధులు ఈ గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## సమ్మె కారణంగా తొలగించిన విద్యుత్ ఆర్టిజన్లు తిరిగి విధుల్లోకి

### మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** సమ్మెకారణంగా తొలగించిన 196 మంది విద్యుత్ ఆర్టిజన్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నటు ఆ శాఖ మంత్రి జి జగదీశ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం జరిగిన చర్చల సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలు తిరిగి పునరావృతం కాకూడదన్నారు. వాస్తవానికి ఔట్ సోర్సింగ్ పేరుతో విధులు నిర్వర్తిస్తున్న ఆర్టిజన్లను దేశంలో ఎక్కడా లేని విధంగా క్రమబద్ధీకరించినట్లు చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ చర్చల్లో ట్రాన్స్ కో, జెన్‌కో సింఎండి ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సిఎండి రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైదరాబాద్‌లో విత్తన మేళా

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రానున్న వానాకాలం సీజనులో రైతులకు నాణ్యమైన విత్తనం అందించేందుకు తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం చర్యలు చేపట్టింది. ఇందుకు గాను ఈ నెల 24వ తేదీన విత్తన మేళాను నిర్వహిస్తున్నట్లు విత్తన పరిశోధన విభాగం డైరక్టరు డాక్టర్ వెంకట రమణ తెలిపారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని యూనివర్సిటీ తోపాటు, మూడు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానాలైన రాష్ట్రంలోని జగిత్యాల, పాలెం, వరంగల్‌లో కూడా ఈ విత్తన మేళాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొత్తం 10 పంటలోలన 45 వంగడాలకు సంబంధించి 15 వేల క్వింటాళ్ల విత్తనాలను విక్రయానికి అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంస్థలు, ఐఐఓఆర్, ఐఐఎంఆర్, సీఆర్‌డీఏ, ఉద్యాన, పశు వైద్య విశ్వవిద్యాలయాలు, అనుబంధ సంస్థలైన టీఎస్ఎస్‌డీసీ, ఎన్ఎస్‌సీ, టీఎస్ఎన్‌వోసీఏ ఈ విత్తన మేళాలో పాల్గొంటున్నట్లు పేర్కొన్నారు.

## మళ్లీ పెరగనున్న కందిపప్పు ధరలు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఆకాశాన్నంటిన వంట నూనె ధరలు దిగివచ్చిన నేపథ్యంలో ఇప్పుడు పప్పుల ధరలకు రెక్కలు రానున్నాయి. నిత్యావసర వస్తువుల్లో ప్రధాన ఆహారం కంది పప్పు ధరలు మరోసారి పెరగనున్నాయి. దేశ వ్యాప్తంగా పప్పుల ధరలు పెరుగుతున్న తరుణంలో దాని ప్రభావం తెలంగాణపై పడనుంది. గత కొన్ని రోజులుగా కందిపప్పు ధర క్రమేణా పెరుగుతూ వస్తోంది. రెండు నెలల క్రితం కిలో 102 రూపాయలు ఉన్న కంది పప్పు ధర అది కాస్తా ప్రస్తుతం 150 రూపాయలకు చేరింది. అయితే ఇది మరి కొద్ది రోజుల్లో మరోసారి పెరిగే అవకాశాలు ఉన్నాయని మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. కిలో దాదాపు 200 రూపాయల నుండి 220 రూపాయల వరకూ చేరే వీలుందని అంచనా వేస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే కొందరు దళారులు, బడా వ్యాపారులు కంది పప్పును నిల్వ చేసి కృత్రిమ కొరతను సృష్టిస్తున్నట్లు ఆరోపణలు చోటు చేసుకుంటున్నాయి.

# క్వాలిఫయర్ వన్ విజేత సిఎస్కే!

### 15 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్ ఓటమి
### నేరుగా ఫైనల్స్ అర్హత సాధించిన ధోనీ సేన

**చెన్నై, మే 23 :** ఐపిఎల్ 2023సీజన్‌లో క్వాలిఫయర్‌వన్‌గా జరిగిన మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ గుజరాత్ టైటాన్స్‌పై చెన్నై సూపర్‌కింగ్స్ విజయం సాధించింది. చెన్నైలోని చేపాక్ వేదికగా ఈమ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి గుజరాత్‌కెప్టెన్ హార్ధిక్ పాండ్యా ఫీల్డింగ్ ఎంచుకున్నారు. మ్యాచ్‌లో గౌరవప్రదమైన స్కోరును చేసిన చెన్నై గుజరాత్ జట్టును నిలువరించేక్రమంలో బౌలర్లు, ఫీల్డర్లు వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు. తొలుత బ్యాటింగ్‌చేసిన చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 172 పరుగులుచేసింది. తదనంతరం బ్యాటింగ్ చేపట్టిన గుజరాత్ టైటాన్స్ 157 పరుగులకే ఆలౌట్ కావడంతో జట్టు కథ ముగిసింది. చివరకు 15 పరుగుల తేడాతో చెన్నై సూపర్‌కింగ్స్ విజయం సాధించింది. దీనితో చెన్నై జట్టు నేరుగా ఫైనల్స్‌కు ప్రవేశించింది. 173 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ సరిగ్గా 20 ఓవర్లలో 156 పరుగులకు ఆలౌట్ అయింది. శుభ్‌మన్‌గిల్ 38 బంతుల్లో 42పరుగులుచేసాడు. నాలుగుఫోర్లు ఒకసిక్స్‌తో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. చివరిలో రషీద్‌ఖాన్ 16 బంతుల్లో 30 పరుగులుచేసి విజయం కోసం పోరాటంచేసినా ఫలితం దక్కలేదు. దీపక్‌చాహర్, మహీశ్‌థీక్షణ, రవీంద్ర జడేజా, పతిరణలు చెరో రెండు వికెట్లు తీసారు. ఈ మ్యాచ్‌లో ఓడినా ఫైనల్‌కు చేరేందుకు గుజరాత్‌కు మరో ఛాన్స్ ఉంది. శుక్రవారం జరిగే క్వాలిఫయర్2 మ్యాచ్‌లో ఎలిమినేటర్ విజేతతో తలపడాల్సి ఉంది. ఇక తొలుత బ్యాటింగ్‌చేపట్టిన చెన్నై జట్టులో రుతురాజ్ గైక్వాడ్ 44 బంతుల్లో 60 పరుగులుచేసాడు. ఏడుఫోర్లు ఒక సిక్స్‌కూడా సాధించి అర్ధసెంచరీతో మెరిశాడు. మరో ఓపెనర్ డెవాన్ కాన్వే కూడా 34 బంతుల్లో నాలుగుఫోర్లతో 40 పరుగులుచేసి రాణించాడు. చివరిలో రవీంద్రజడేజా 16 బంతుల్లో 22 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. గుజరాత్ బౌలర్లలో మోహిత్‌శర్మ మహ్మద్‌షమీలు చెరో రెండు వికెట్లు తీసారు. గుజరాత్‌జట్టులోని మహ్మద్‌షమీ, నల్కండేలు కట్టుదిట్టంగా బౌలింగ్‌చేయడంతో చెన్నై ఓపెనర్లు ముందు తడబడ్డారు. రుతురాజ్‌గైక్వాడ్‌తన వ్యక్తిగతస్కోరు రెండుపరుగులవద్ద నల్కండే బౌలింగ్‌లో గిల్‌కు క్యాచ్ ఇచ్చిఔట్ అయ్యాడు. అయితే అది నోబాల్‌కావడంతో బతికిపోయాడు. తనకు వచ్చిన లైఫ్‌ను రుతురాజ్ చక్కగా వినియోగించుకున్నాడు. ఇక్కడినుంచి రుతురాజ్ వేగంగా ఆడాడు. మరో ఎండ్‌లో కాన్వేబాల్‌ను టైమ్‌చేయడానికి ఇబ్బంది పడ్డాడు. అయితే రుతురాజ్ వేగంగా ఆడటంతో చెన్నై స్కోరు బోర్డు వేగంగా ముందుకు కదిలింది. ఈ



క్రమంలో రుతురాజ్ అర్ధసెంచరీని ఆదుకున్నాడు. 87 పరుగులు జోడించిన తర్వాత రుతురాజ్ ఔట్ అయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన శివమ్‌దూబే ఒకే ఒక్కపరుగుచేసాడు. నూరఅహ్మద్ బౌలింగ్‌లోక్లీన్ బౌల్డ్ అయ్యాడు. అజింక్యా రహానె 17, అంబటిరాయుడు 17 పరుగులతో నిరాశపరిచారు. ధోనీ ఒకే ఒక్కపరుగుచేసి ఇలా వచ్చి ఆలా వెళ్లాడు. చివరిలో జడేజా మొయిన్ ఆలీ ఒక సిక్సర్ బాదడంతో చెన్నై 172 పరుగులకు చేరింది. వికెట్‌స్లోగా ఉండటంతో ఈటార్గెట్‌ను ఛేజ్‌చేయడంకూడా అంత సులువేమీ కాదు. ద్యూరాకపోతే చెన్నైకే గెలుపు అవకాశాలు ఎక్కువని ఈ విక్టరీ తేల్చిచెప్పింది.

## పోస్టాఫీసుల్లోనూ 'పాస్‌పోర్టు' సేవలు

### హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య

**హైదరాబాద్, మే 23,ప్రభాతవార్త:** పాస్‌పోర్టులకు పెరుగుతున్న డిమాండ్‌ను అధిగమించేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ చర్యలు చేపట్టిందని హైద రాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్టు అధికారి దాసరి బాలయ్య వెల్లడించారు. హైదరాబాద్ ప్రాంతీయ పాస్ట్‌పోర్టు కార్యాలయం పరిధిలో 14 తపాలా కార్యాలయాల్లో సేవలందిస్తాయని ఈనెల 20నుంచే అవి అందుబాటులోకి వచ్చాయన్నారు. సిద్దిపేట్, అదిలాబాద్, నల్గొండ, ఖమ్మం, వరంగల్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మెదక్, భువనగిరి, మంచిర్యాల, కామారెడ్డి, వనపర్తి, మేడ్చల్, వికారాబాద్‌లో ఈసేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు తపాలా కార్యాలయాలు పాస్‌పోర్టు సేవలు అందిస్తాయని ఆయన వివరించారు. ప్రతి బుధవారం సాయంత్రం 4నుంచి 4.30గంటల మధ్యలో 700 సాధారణ అపాయింట్‌మెంట్లు రిలీజ్ చేస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజు అపాయింట్‌మెంట్ 10 నుంచి 15శాతం వివిధ కారణాలతో తిరస్కరణకు గురవుతున్నాయని ఈపరిణామం ఇతర దరఖాస్తు దారులకు ఇబ్బందిగా మారిందన్నారు. అపాయింట్‌మెంట్ సమయంలో అవసరమైన పత్రాలు సమర్పించాలని బాలయ్య సూచించారు. దరఖాస్తు దారుల వేచి ఉండకుండా సేవలందిచాలని భావిస్తున్నామని ఇప్పటివరకు మెడికల్, ఉద్యోగ, విద్య, అవసరాలకు సంబంధించిన పత్రాలు కలిగిన దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టుకు అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ప్రశంసలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 23:** కాళేశ్వరం ప్రాజెక్టుకి అవార్డు అందించిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ప్రెసిడెంట్ మరియా సి లెమన్ ప్రాజెక్టు పైన ప్రశంసలు కురిపించారు. అమెరికన్ సివిల్ సొసైటీ ఆఫ్ ఇంజనీర్స్ ప్రతినిధులు ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం పైన ప్రశంసలు కురిపించారు.

అమెరికాలోని నేవెడా రాష్ట్రంలో సోమవారం ప్రారంభమైన ప్రపంచ ఎన్విరాన్మెంటల్,వాటర్ రిసోర్స్ కాంగ్రెస్ సమావేశంలో ప్రారంభ ఉపన్యాసం చేసిన తర్వాత మంత్రి కెటిఆర్ అమెరికన్ సివిల్ సొసైటీ ఆఫ్ ఇంజనీర్స్ సీనియర్ ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శించిన సందర్భంగా తమ అనుభవాలను పంచుకున్నారు. అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ తదుపరి ప్రెసిడెంట్ షిరిల్ క్లార్క్ కాళేశ్వరం పాజెక్టు అత్యద్భుతం అని పొగిడారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ ప్రజల జీవితాల్లోని వచ్చిన మార్పు గొప్పదన్నారు. ఒక హైడ్రాలిక్ ఇంజనీర్‌గా వాటర్‌ను 500 మీటర్ల సముద్రమట్టానికి పైగా తీసుకురావడం ఊహకు అందని గొప్ప ఆలోచన అన్నారు.

సొసైటీ అధ్యక్షురాలు లెమన్ మాట్లాడుతూ తమ సంస్థ కాళేశ్వరం లాంటి వినూత్నమైన,అద్భుత ప్రాజెక్టులను ప్రపంచానికి పరిచయం చేయడం తమ ఉద్దేశం అన్నారు. ఈ దిశగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన అనుభవాలను వీడియోలు,ఇతర రూపాల్లో ప్రపంచానికి చాటుతామన్నారు. తన విద్యార్థులకు కాళేశ్వరం ప్రాజెక్టు అనుభవనాలను, ప్రాజెక్టు డిజైన్,నిర్మాణం వంటి అంశాలపైన వారికి వివరాలు అందిస్తామని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రశంసలు కురిపించిన అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ ప్రతినిధులకు మంత్రి కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు.

# రాజస్థాన్‌లోని కాంగ్రెస్ సర్కారుది అవినీతి కుంభకోణాల్లో రికార్డు బ్రేక్

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సిపి జోషి

**జైపూర్, మే 23:** రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి విషయంలో అన్ని రికార్డులను దాటేసిందని ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు సిపి జోషి మంగళవారం ఆరోపించారు. రాష్ట్రంలో వెళ్లూనుకున్న అవినీతిపై, రోజురోజుకు క్షీణిస్తున్న శాంతిభద్రతల పరిస్థితి, ప్రభుత్వ నియామకాలకు సంబంధించిన పరీక్ష పేపర్ లీక్ తదితర అంశాలపై రాష్ట్ర రాజధాని జైపూర్‌లో వచ్చే 7న బిజెపి నిరసన ప్రదర్శన నిర్వహించనున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సిపి జోషి అన్నారు. ఈ మేరకు జైపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు చాలాసార్లు అవినీతిపై ధ్వజమెత్తారు. అయితే.. దేశచరిత్రలోనే తొలిసారిగా ఓ ప్రభుత్వ కార్యాలయంలోనే కోట్లాది రూపాయలు, బంగారు బిస్కెట్లు బయటపడి ప్రభుత్వ అవినీతి తీరును బట్టబయలు చేసిందని సిపి జోసి అన్నారు. జైపూర్‌లోని యోజన భవన్ అనే ప్రభుత్వ కార్యాలయం భవనం బేస్‌మెంట్‌లోని తాళం వేసి ఉన్న ఓ బీరువా నుంచి 2.31 కోట్ల నగదు, ఒక కిలో బంగారాన్ని స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఈ కేసుకు సంబంధించి సమాచార సాంకేతిక విభాగానికి చెందిన ఒక జాయింట్ డైరెక్టర్‌ను ఎసిబి అధికారులు అరెస్టు చేశారు.

ఓవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిపై జీరో టాలరెన్స్ విధానం గురించి మాట్లాడుతుందని, మరోవైపు బ్లాక్ లిస్టులో ఉన్న ఓ కంపెనీకి ఐటి విభాగం 135 కోట్ల టెండర్‌ను కట్టబెట్టిన కుంభకోణం వెలుగుచూసిందని బిజెపి ఎంపి కిరోరిలాల్ మీనా విమర్శించారు. భవిష్యత్తులో మరిన్ని స్కామ్‌లను బయట పెడతానని, ఆ అవినీతి కేసులన్నిటిని ఇడి, సిబిఐచే విచారణ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 25వేల కోట్లకుపైగా స్కామ్ జరిగిందని రాజస్థాన్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేత రాజేంద్ర రాథోడ్ ఆరోపించారు. ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మహిళలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమంలోనూ అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. అలాగే సమాచార, సాంకేతిక విభాగం ద్వారా వచ్చిన అన్ని టెండర్లను రద్దు చేసి, విచారణ చేపట్టాలని రాథోడ్ డిమాండ్ చేశారు. అలాగే జల్‌జీవన్ మిషన్, విద్యుత్ ప్లాంట్‌లకు అవసరమైన బొగ్గు సేకరణలోనూ అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు.

## 'సివిల్స్'లో తెలుగు మెరుపులు

≫ ఏపీకి చెందిన పవన్‌దత్తా 22వ ర్యాంక్‌ను సాధించింది. సివిల్స్-2022కి సంబంధించిన ఫలితాలను యూపీఎస్‌సీ మంగళవారం ప్రకటించింది. మొత్తం 933 మందిని యూపీఎస్‌సీ ఎంపిక చేసింది. వారిలో జనరల్ కోటాలో 345 మంది ఉండగా.. ఈడబ్ల్యూఎస్ నుంచి 99 మంది.. ఓబీసీ నుంచి 263 మంది.. ఎస్సీ నుంచి 154 మంది.. ఎస్టీ నుంచి 72 మంది ఉన్నారు. కేడర్ వారీగా చూస్తే 180 మంది ఐఏఎస్ సర్వీసుకు, 38 మంది ఐఎఫ్ఎస్‌కు ఎంపిక కాగా.. 200 మంది ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. వీరు కాకుండా సెంట్రల్ సర్వీసెస్‌లోని గ్రూప్-ఏ కేటగిరీలో 473 మంది.. గ్రూప్-బీలో 131 మ ంది ఎంపికైనట్లు యూపీఎస్‌సీ ప్రకటించింది.

**సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన తెలుగు అభ్యర్థులు**

సివిల్స్-2022 ఫలితాల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులు తమ సత్తా చాటారు. తెలంగాణకు చెందిన ఉమా హారతి ఏకంగా ఆలిండియా 3వ ర్యాంక్ సాధించగా.. ఏపీలోని తిరుపతికి చెందిన పవన్‌దత్తా 22వ ర్యాంక్ సాధించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన తరుణ్ పట్నాయక్ 33వ ర్యాంక్ సాధించారు. వరంగల్‌కు చెందిన సాయి ఆశ్రిత్ 40వ ర్యాంక్‌ను సాధించారు. వీరు కాకుండా ర్యాంకులు సాధించిన వార వివరాలు..

| ర్యాంక్ | పేరు | 346 | ఎస్ చేతనారెడ్డి |
|---|---|---|---|
| 33 | తరుణ్ పట్నాయక్ | 362 | యారగట్టి శ్రుతి |
| 35 | అజ్మీరా సంకేత్ కుమార్ | 376 | సోనియా కటారియా |
| 40 | శాఖమూరి శ్రీయి ఆశ్రిత్ | 384 | యప్పలపల్లి సుష్మిత |
| 60 | సాయి ప్రణవ్ | 410 | రేవయ్య |
| 94 | ఆవుల సాయికృష్ణ | 426 | సీహెచ్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి |
| 110 | నిధి పాయ్ | 462 | బొల్లిపల్లి వినూత్న |
| 132 | ఏనుగు శివమారుతీరెడ్డి | 548 | దామెర హిమ వంశీ |
| 157 | రాళ్లపల్లి వసంతకుమార్ | 550 | రేవూడి నవీన్ చక్రవర్తి |
| 200 | కమతం మహేష్ కుమార్ | 558 | కొట్టె రుత్విక్ సాయి |
| 217 | రావుల జయసింహారెడ్డి | 566 | తమ్మదడ్డి పద్మన్న |
| 243 | సాహిత్య | 583 | ఎర్రంశెట్టి రమణి |
| 257 | అంకుర్ కుమార్ | 607 | భవిరి సంతోష్ కుమార్ |
| 270 | బి ఉమామహేశ్వర్‌రెడ్డి | 640 | తమ్మల సాయికృష్ణారెడ్డి |
| 285 | చల్లా కళ్యాణి | 694 | పసులూరి రవికిరణ్ |
| 292 | పి విష్ణువర్ధన్‌రెడ్డి | 742 | సాయినాథ్ రాందేని |
| 293 | సాయికృష్ణ | 772 | రెడ్డి భార్గవ్ |
| 311 | లక్ష్మీ సుజిత | 868 | నాగుల కృపాకర్ |

# కార్పొరేట్ల చేతుల్లోకి సహకారం

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రైతాంగానికి ఆర్థిక సహకారం అందించాల్సిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్ల నున్నాయి. ఇప్పటికే సహకార రంగంలో చేపట్టాల్సిన మార్పులపై నాబ్‌కాన్స్ అనే ప్రైవేటు కన్సల్టెన్సీ ఇచ్చిన నివేదిక అమలు ప్రారంభమైందని సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో రైతుల శ్రేయస్సు, సహకారం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఏర్పాటైన ఈ వ్యవసాయ సహకార సంఘాలు దాన్ని విస్మరించి ధనార్జనే ధ్యేయంగా మారిపోతున్నాయి. గ్రామ స్థాయిలో రైతులకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ సహకార పరపతి సంఘాలును పూర్తిగా వ్యాపార దృక్పధానికి మళ్లించేందుకు ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. సహకార సంఘాల్లో ప్రొఫెషనల్ కన్సల్టెన్సీలకు పదవులు, పెట్రోల్ బంక్‌లు, సూపర్ మార్కెట్‌లు, విస్తృతమైన డిజిటలైజేషన్ వంటి వాటితో బహుళ వ్యవహారాలకు కేంద్రాలుగా రూపాంతరం చెందుతున్నాయి. సహకార రంగ పునరుజ్జీవం, బలోపేతం అనే ముద్దు పేర్లతో ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టుల వెనుక ఉన్న అసలు రహస్యం సహకార సంఘాలను పూర్తి స్థాయి వ్యాపారల లావాదేవీలకు కేంద్రాలుగా చేయడమేననే అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకూ సహకార రంగంలోకి నేరుగా కార్పొరేట్లు, ప్రైవేటు సంస్థలు ప్రవేశించేందుకు వీలులేకుండా కఠిన చట్టాలు ఉన్నాయి. సంఘ సభ్యుల అభీష్టం మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల కార్యకలాపాలన్నీ సాగేవి. అయితే సహకార రంగ ఆస్తులు, అవి నిర్వహించే సేవల్లో కార్పొరేట్ల చొరబాటుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సహకార శాఖ అధికారులు చెబుతున్నారు. సహకార సంఘాల్లో కార్పొరేట్లకు గేట్లు బార్లా తీసే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి.

### ● ధనార్జనే ధ్యేయంగా పిఎసిఎస్‌లు ● లాభాపేక్షతో కార్యకలాపాలు ● నాబ్‌కాన్స్ నివేదిక అమలు! ● అన్నదాతకు వ్యవసాయ సంఘాల తొండి

ఇందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుతం ఇరుసుగా ఉపయోగపడుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా నెలకొల్పిన సహకార మంత్రిత్వ శాఖ దేశ వ్యాప్తంగా రెండు దశల్లో 68 వేల సహకార సంఘాల డిజిటలైజేషన్ ద్వారానే వాటి ఆర్థిక లావాదేవీలను తన నియంత్రణలోకి తీసుకొస్తోంది.

ఇందులో భాగంగా తెలంగాణలోని సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందుకుగాను ఒక్కో సహకార సంఘానికి 4.37 లక్షల రూపాయల మేర వ్యయం అవుతుందని అధికారిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. రాష్ట్రంలోని సహకార సంఘాల డిజిటలైజేషన్ ప్రక్రియ దశలవారీగా సాగుతుండగా, అందుకయ్యే ఖర్చులో 60 శాతం కేంద్రం భరిస్తుండగా, మిగిలిన 40 శాతం రాష్ట్రం పెట్టుకుంటున్నాయి. కేంద్రం ప్రకటించిన ఆత్మ నిర్భర్ భారత్ ప్యాకేజీలో వ్యవసాయ మౌలిక వసతుల నిధి ఒకటిగా ఉంది. ఇందుకు జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) అప్పును ఇస్తుంది. సహకార సంఘాలలో గోదాములు, పాల శీతల, సేకరణ కేంద్రాలు, వ్యవసాయ యంత్రాలను అద్దెకు ఇచ్చే కష్టమ్ హైరింగ్ సెంటర్లు వంటి సదుపాయాలు ఒకే చోట లభించే బహుళ వసతుల కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేసింది. వాణిజ్యానికి అనుకూలంగా ఉండే వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు చెందిన స్థలాల్లో ఐఓసి, హిందూస్థాన్ పెట్రోలియం వంటి సంస్థలకు చెందిన పెట్రోలు, డీజిల్ బంక్‌ల ఏర్పాటుకు అనుమతినిస్తారు. ఈ విధంగా వ్యవసాయ సహకార సంఘాల్లో వ్యాపారం, లాభాపేక్ష లక్ష్యాలతో రైతులకు అందించాల్సిన సహకారం కలగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని సహకార రంగ ప్రముఖుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

